## విఎన్ఆర్‌విజెఐఇటీలో ప్రారంభమైన కన్వర్జెన్స్2కె25



ప్రారంభోత్సవ కార్యక్రమంలో డా.సివిఎస్.కిరణ్ తదితరులు

**నిజాంపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కన్వర్జెన్స్2కె25 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వార్షిక సాంకేతికోత్సవాలు శనివారం ప్రారంభమైయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కైరూట్ ఏరోస్పేస్‌లో మెటీరియల్స్ అండ్ స్ట్రాటెజిక్ ఇనిషియేటీవ్స్ విభాగ ఉపాధ్యక్షులు డా.సివిఎస్.కిరణ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో భారతదేశంలో పురోగతి ఉన్న కొన్ని విడిభాగాలకై ఇతర దేశాల మీద ఆధారపడాల్సి వస్తుందన్నారు. ఉత్పత్తిరంగ సమాగ్రాభివృద్ధికి, తయారీకి సంబంధించిన పద్దతులు, ముడిసరుకులు, విడిభాగాలు అన్ని భారతదేశంలోనే తయారు చేసుకోవడం వలన సాంకేతిక స్వయం సమృద్ధి సాధ్యమైతుందని అభిప్రాయపడ్డారు. నవతరం ఉత్పత్తి రంగంలోకి అడుగుతున్న ఈసమయంలో డిజిటల్ మ్యానుఫాక్చరింగ్, అడిటివ్ మ్యానుఫాక్చరింగ్, సర్క్యూలర్ మ్యానుఫాక్చరింగ్‌లతో సహా స్పేస్ మ్యానుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ వంటి రంగాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కోడే దుర్గ ప్రసాద్, డా.డిఎన్.రావు, డా.వై.పద్మశాయి, డా.బి.చెన్న కేశరావు, కె.హరిశ్చంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు భాగ్య పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా భాగ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర ్యంలోఈ నెల23 న ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుగు తుందని స్కూల్ కరస్పాండెంట్ ఎం.శ్రీలతాగౌతం, ప్రధానోపా ధ్యాయురాలు రత్నమేరి తెలిపారు. ఛాదర్‌ఘట్‌లోని తమ స్కూల్ ప్రక్కనే ఉన్న విక్టరి ప్లే గ్రౌండ్‌లో ఈ ఆత్మీయ సమ్మేళ నం జరుగుతుందని, 1000 మంది విద్యార్థులు పాల్గొనే ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ముఖ్యఅతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్-చాన్సలర్ డా.ఆవుల మంజులత పాల్గొంటారని చెప్పారు. సాయంత్రం 3 గంటల నుంచి సాంస్కృతిక కార ్యక్రమాలు కొనసాగుతాయని, ఈ సమ్మేళనంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## రవాణాశాఖకు భూకేటాయింపు రద్దు చేయాలి



మాట్లాడుతున్న డా.ఎస్.మల్లారెడ్డి

**దుండిగల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** దుండిగల్ పరిధి సర్వేనంబర్ 454లో ప్రభుత్వం రవాణశాఖ కార్యాలయంకు 40 ఎకరాలు కేటాయింపు వేంటనే రద్దు చేయాలని భాజపా మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి ప్రెసిడెంట్ డా.ఎస్.మల్లారెడ్డి పేర్కోన్నారు. రవాణశాఖ కార్యాలయంలకు భూమి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ వార్డు కార్యాలయంలో రైతులతో అఖిలపక్షం నేతలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్ళుగా మాఆధీనంలో ఉన్న భూములను ప్రభుత్వం లాక్కోవడం, వివిధ శాఖలకు కేటాయించడం దారుణమన్నారు. నేతలు మాట్లాడుతూ రైతులను భూములను ఇష్టానుసారంగా లాక్కుంటామంటే ఊరుకునేది లేదన్నారు. ముందుగా ఆర్టీవోకు కేటాయింపును రద్దు చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కావలి గణేష్, జక్కుల మల్లేష్, భాజపా మేడ్చల్ కార్యదర్శి విఘ్నేశ్వరచారి, ఆకుల మల్లేష్, భారసా మాజీ కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్ తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

## వేసవిలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు
### -ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం జలమండలి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, వాటి పురోగతిపై సమీక్షించారు.చేపట్టాల్సిన పనులను వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అధికారులను సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. బస్తీలు, కాలనీలలో మంచినీటి సరఫరా డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. ఎక్కడా లోప్రెషర్ లేకుండా చూడాలని, సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆయా బస్తీలు, కాలనీలకు ప్రత్యేక వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని జలమండలి అధికారులకు సూచనలు జారీ చేశామని చెప్పారు. వేసవి సమీపిస్తున్న కొన్ని పనులు ఇంకా పెండింగ్‌లో ఉంచరాదని చెప్పినట్లు పేర్కొన్నారు.

## పూర్తయిన రిజర్వాయర్ పనులు..తీరనున్న తాగునీటి కష్టాలు



రహమత్‌నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :**

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. బస్తీలలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తగిన విధంగా నీటి సరఫరాకోసం పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నామని అదేవిధంగా నూతన రిజర్వాయర్ పనులు కూడా పూర్తయ్యాయని తొందర్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ సూర్యప్రకాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఫాస్ట్ డ్రాయింగ్, స్క్రూటిని సిస్టం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

**-ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్‌లకు బిల్డ్‌నౌ డి.సి.ఆర్ పై శిక్షణ**
**-జిహెచ్ఎంసి చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:**
ఫాస్ట్ డ్రాయింగ్, స్క్రూటిని సిస్టం కోసం అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులు వేగవంతంగా పూర్తవుతాయని జిహెచ్ఎంసి ఛీఫ్ సిటీప్లాన్ కె.శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్ కోసం అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో కూడిన యూనిఫైడ్ సింగిల్ విండో సిస్టమ్‌ను అమలుకు బిల్డ్‌నౌ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈమేరకు శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో బిల్డ్ నౌ డి.సి.ఆర్ పై లైసెన్స్ గల ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్‌లకు హ్యాండ్స్ ఆన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి సిటీప్లానర్ కె.శ్రీనివాస్‌తోపాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్.దేవేందర్ రెడ్డిలు హాజరై బిల్డ్ నౌ డి.సి.ఆర్ వ్యవస్థ పై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడంతో పాటు భవన అనుమతుల ప్రక్రియలో క్రియేషన్ ఆఫ్ టెంపులేట్స్, లేయర్లు, వివిధ ఎంటిటిలను రూపొందించడం గురించి అవగాహన కల్పించారు. ఇదిఆర్కిటెక్‌లు, ఇంజనీర్లకు తమ ప్రాజెక్టులను నిబంధనల మేరకు రూపొందించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా బిల్డ్ నౌ అప్లికేషన్ బృందం శిక్షణ కార్యక్రమంలో డి.సి.ఆర్ వ్యవస్థ పై వివరణాత్మక ప్రదర్శన అందించడంతో పాటు డి.సి.ఆర్ పోర్టల్‌లో డ్రాయింగ్ తయారీ ప్రక్రియను వివరించారు. శిక్షణలో భాగంగా తలెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈశిక్షణ కార్యక్రమం భవనాల రూపకల్పన, అనుమతుల ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు దోహదపడుతుందని అన్నారు. ప్రామాణిక నిర్మాణ నిబంధనల మేరకు ప్రాజెక్ట్‌లు, డ్రాయింగ్ లను ప్రణాళిక బద్దంగా రూపొందించేందుకు ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లకు ఉపయుక్తమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ సిసిపిలు, సిపిలు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, బిల్డ్ నౌ అప్లికేషన్ బృందం తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సిసిపి కె.శ్రీనివాస్ తదితరులు

# నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వం టైం స్కేల్ ఇవ్వాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో సంవత్సరాలు తరబడి పనిచేస్తున్న నాన్-టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వం టైం స్కేల్ ఇచ్చేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు టైం స్కేల్ న్యాయబద్దమైనదని, ఈవిషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానిని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జెఎసి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను సామాజికి కోణంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారించే విధంగా ప్రయత్నం చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా కాంట్రాక్ట్ విధానాన్ని పాలకులు తీసుకువచ్చారని, దీంతో వారు ఆనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌లో 15 నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత బడ్జెట్ సమావేశాల్లో చాలా తక్కువగా కేటాయించిందని ఆరోపించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, వైస్-ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం మాట్లాడుతూ ఉద్యోగులవి న్యాయమైన డిమాండ్ల అని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సదస్సులో విద్యా కమిషన్ సభ్యులు సి.హెచ్.వెంకటేష్, డా.పరుశురామ్, సంఘం జెఎసి ఛైర్మన్ సూర్యచందర్, అధ్యక్షుడు కట్టా వెంకటేష్, నాయకులు చిర్యాల శ్రీనివాస్, శ్రీకాంత్, మనమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కోదండరామ్. చిత్రంలో హరగోపాల్, ఇటికాల పురుషోత్తం తదితరులు

# ఉత్సాహంగా ప్రారంభమైన క్రీడలు సాహితీ ,సాంస్కృతిక పోటీలు

**-పోటీతత్వం ఉన్నప్పుడే లక్ష్యాలను చేరుకుంటాం**
**-డిసిపి సిహెచ్ శ్రీనివాస్**



**అత్తాపూర్ ఫిబ్రవరి22,ప్రభాతవార్త :** పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయ స్థాయి మూడవ ఇంటర్ కాలేజిట్ క్రీడా సాహితి మరియు సంస్కృతిక పోటీలు ఉత్సాహంగా ప్రారంభమైయ్యాయి. శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలంలో స్పోర్ట్స్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ హాజరై విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ శరత్ చంద్ర ,డీనో ఫ్యాకల్టీస్ ఉదయ్ కుమార్, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ సతీష్‌లతో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ.... క్రీడా పోటీలు కూడా వ్యాయామంతో సమానమని తెలిపారు. పోటీతత్వం ఉన్నప్పుడే మ్నన నిర్దేశించుకున్న లక్ష్యాలను, ఉత్తమ ఫలితాలని అందుకోగలుగుతామని, అనుకున్న లక్ష్యం అందుకోలేక పోయినా నీరుగారకుండా మరింత దృఢ సంకల్పతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ క్రీడలతో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని, క్రమశిక్షణ, టీం వర్క్ మరియు మానసిక ఆరోగ్యం పెంపొందించడంలో క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. డీనో ఫ్యాకల్టీస్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు, సిబ్బందికి చదువుతోపాటు శారీరక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని అందుకోసం తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని విజయం కోసం కాకుండా క్రీడా స్ఫూర్తిని ఆస్వాదించాలని కోరారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఫిట్నెస్‌కు క్రీడలు ఎంతో దోహదపడతాయని క్రీడల వలన డోపమైన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి అయి శారీరక, మానసిక ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని కలగజేస్తుందని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మెంటన్, టేబుల్ టెన్నిస్, చెస్ మరియు అథ్లెటిక్ ఈవెంట్స్ తోపాటు సాహితీ మరియు సాంస్కృతిక పోటీలు శనివారం నుండి 25 వ తేదీ వరకు జరగనున్నాయని పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి తెలియజేశారు.

ఈ క్రీడల్లో పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్, మాము నూరు, కోరుట్ల, కామారెడ్డి మరియు పెబ్బేరు కళాశాలల నుండి 250 వి ద్యార్థినీ విద్యార్థులు బోధన సిబ్బంది, బోధినేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కామారెడ్డిలో బిసిలకు ప్రకటించిన డిక్లరేషన్ అమలు చేయాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:**
కామారెడ్డిలో జరిగిన సభలో బిసిలకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బిసి డిక్లరేషన్‌లో ఒక్క హామీని కూడా నేరవేర్చలేదని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి బిసిల్లో చీలికలు తీసుకురావడానికి కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని, ఇందులో భాగంగానే నేడు బిసి నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి కుల గణన సరైనదేనని, ప్రభుత్వానికి మద్దతు ప్రకటించమని కోరడం, మీకు ఎం కావాలో తెలియజేయండని, అంతేకాని కులగణన సరిగా లేదని చెప్పవద్దని కోరుతున్నారని ఆయన ఆరోపించారు. బిసిలపై ప్రభుత్వానికి చిత్తశుద్ది లేదని, ఉంటే ప్రభుత ్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా కామారెడ్డి డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం కుట్రలను బిసిలు గమనిస్తున్నారని, మీ అసలు రూపాని ్న బహిర్గతం చేస్తామని, బిసిలను జాగృతి చేస్తామని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసేంతవరకు వదలబోమని ఆయన హెచ్చరించారు.

## వైభవంగా భ్రమరాంభ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవ వేడుకలు

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :**
బోరబండ ఎన్ఆర్ఆర్ పురం సైట్2లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీమల్లన్న స్వామి జాతర 17వ కళ్యాణోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 5 గంటలకు గంధ తెప్పోత్సవంతో ఉత్సవాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ముఖ్య సలహాదారులు కట్టెల శ్రీనివాస్ యాదవ్, సలహాదారులు గొంటి కృష్ణయాదవ్, చైర్మన్ మానుక మహేష్ యాదవ్, వైస్ చైర్మన్ మెరిగె శివన్న యాదవ్, అధ్యక్షులు ఆంజనేయులు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శంకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బస్తిరాజు వీరేష్ యాదవ్, కోశాధికారి సర్వ శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'నవరత్న మహిళా పురస్కారాల' ప్రదానం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'నవరత్న మహిళా పుర స్కారాల' ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ గుడిబండి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వివి.రాఘవరెడ్డి వివరించారు. మార్చి 10న చిక్కడపల్లి శ్రీ త్యాగ రాయ గానసభలో జరిగే ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందించబోతున్నట్లు తెలిపారు. యువకళావాహిని అధినేత లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ, ఆధ్యాత్మిక రచయిత డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి, కళాపోషకులు వడ్లకొండ వెంకటరావు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు నిర్మలా ప్రభాకర్, ప్రముఖ వీణా విద్వాంసురాలు రామరాజు లక్ష్మీశ్రీనివాస్, జెజె హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ఎల్.జయంతి రెడ్డి, లఘుచిత్ర నిర్మాత జమలాపురం రాధాకృష్ణ తదితరులు పాల్గొంటారన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ సేవలు ఎనలేనివి



దివంగత మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు.

**మలక్ పేట ,ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** దివంగత మాజీ ఎమ్మెల్యే పుంజాల సుధీర్ కుమార్ చేసిన సేవలు ఎనలేనివని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ జయంతి సందర్భంగా కోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1989 సాధారణ ఎన్నికల్లో మలక్ పేట్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా సుధీర్ కుమార్ ఘన విజయం సాధించి ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీలో సామాజిక స్థానం కల్పించిన గొప్ప మహా నాయకుడు సుధీర్ కుమార్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దిల్ షుక్ నగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు అనంతరం నవీన్, మాజీ అధ్యక్షులు తోటరాజు, మాజీ కౌన్సిలర్ త్రివేది, నాయకులు విజయలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌ను కాంగ్రెస్ కంచుకోటగా మారుస్తున్నాం

**- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**
**- కాంగ్రెస్‌లో చేరిన మణికొండ మాజీ కౌన్సిలర్ వసంత్ కుమార్**

**నార్సింగి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ నియోజకవర్గంను కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా మారుస్తున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మణికొండ కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నమ్మినబంటు కొండకళ్ల రామకృష్ణారెడ్డి నాయకత్వంలో మాజీ కౌన్సిలర్ వసంత్ కుమార్ చౌహాన్, ఆయన అనుచరగణం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రకాశ్‌గౌడ్ వసంత్ కుమార్ చౌహాన్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న సంక్షేమాభివృద్ధి పతకాలకు ఆకర్శితులై ఇతర పార్టీలకు చెందిన తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని భూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రత్యేక కసరత్తు చేస్తున్నామన్నారు. సీనియర్ నేతలకు ఈ పనిని అప్పగించామని, చాపకింద నీరులా ఇతర పార్టీల నేతలను కాంగ్రెస్‌లోకి తీసుకు వస్తూ, తిరుగులేని శక్తిగా కాంగ్రెస్‌ను తయారు చేసుకుంటున్నామన్నారు. మణికొండలో గత మూడు దశాబ్దాలుగా రామకృష్ణారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ సర్పంచ్‌గా, ఎంపిటిసిగా, కౌన్సిలర్‌గా ఎన్నికల్లో గెలుపొందారని, ఇలాంటి ప్రజల అభిమానం మెండుగా ఉన్న నాయకుల కృషి వల్లనే ఎన్నికల్లో నాపని సులువు అవుతుందన్నారు. ఇక నుంచి అన్ని పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరుగుతుందని, అందుకు తగ్గ ప్రణాలికలను రూపొందించామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు.



మణికొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వసంత్ కుమార్ చౌహాన్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృశ్యం

## కేంబ్రిడ్జి స్కూల్‌లో ఘనంగా స్పోర్ట్స్‌డే వేడుకలు



కేంబ్రిడ్జి స్కూల్ స్పోర్ట్స్‌డే వేడుకల్లో వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులను అభినందిస్తున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**
అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో శనివారం ఉదయం గోల్నాకలోని కేంబ్రిడ్జ్ స్కూల్ స్పోర్ట్స్ డే వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్కూల్ నిర్వాహకుడు ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్, అల్ కలాం సొసైటీ వైస్ ప్రెసిడెంట్, మహమ్మద్ యాసీన్ షరీఫ్ అతిధులను ఆహ్వానించాగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు హాజరై స్వర్గీయ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించి స్పోర్ట్స్ డే జెండా ఆవిష్కరణ చేసి స్పోర్ట్స్ డేని ప్రారంభించాడు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు చదువులతోపాటు ఆటలలో రాణించాలని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అన్ని విధాలుగా అవకాశాలను కల్పిస్తుందని ఆదిశగా విద్యార్థులు అన్ని రంగాలలో ముందుకెళ్లాలని అన్నాడు కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల ఆటల పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు మన్మోహన్ సింగ్ వేషధారణతో కూడిన చిన్నారుల లగునాటికలు నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నయి. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్‌యాదవ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్ బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్, శ్రీమంత్ గిరి తదితరులు పాల్గొన్నారు. అతిథులను కేంబ్రిడ్జ్ స్కూల్ నిర్వాహకుడు మహమ్మద్ యాసిన్ షరీఫ్, స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ అబదుల్ల సత్కరించారు.వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసి మన్మోహన్ సింగ్ వేషధారణలో ఉన్నటువంటి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ అసిమా అంతుల్ల, కోఆర్డినేటర్ మోహిన్ అహ్మద్ షేక్ అబూ బాకర్ పాల్గొన్నారు.

## ఘనంగా భోగ్‌బండారి వేడుకలు



పూజలో పాల్గొన్న మాజీ ఎంపి రవీందర్‌నాయక్ తదితరులు

**నిజాంపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భోగ్‌బండారి వేడుకలకు మాజీ ఎంపి రవీందర్‌నాయక్, మాజీ మంత్రి అమర్‌సింగ్‌తాలావత్, ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ బంజార ఆరాధ్య ధైవంగా కొలిచే సేవాలాల్ మహారాజు చరిత్ర రమణీయమన్నారు. మూగజీవాలను చంపదంటూ, మత్తు పానీయాలను మరువాలని పేర్కొంటూ బ్రిటిష్ ప్రభుత్వంలో బంజారా ప్రజలపై జరుగుతున్న అరాచకాలను ఎదిరిస్తూ, బంజారా జాతిని చైతన్యం పరుస్తూ సన్మార్గంలో నడిపినటువంటి మహోన్నత వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అన్నారు. ఆయనను తలచుకుంటూ భోగ్‌బండారి కార్యక్రమం నిర్వహించిన స్థానిక బంజార సేవా సంఘం నాయకులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, చల్లా సుధీర్‌రెడ్డి, రాంబాబునాయక్, రవినాయక్, రాములునాయక్, రామచంద్రనాయక్, అశోక్‌నాయక్, దుర్గాదాస్, బంజారా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను సమస్యలను పరిష్కారించుకోవాలి : డిసి



**అత్తాపూర్ ఫిబ్రవరి22,ప్రభాతవార్త :**
ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం "ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్ పేర్కొన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఆస్తి పన్ను పరిష్కారం కోసం ప్రాపర్టీ ట్యాక్స్ కార్యక్రమానికి పలువురు హాజరై తమ ఆస్తి సమస్యలను పరిష్కరించుకున్నారు.ఈ సందర్భంగా డిసి రవి కుమార్ మాట్లాడుతూ....ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం కార్యక్రమంలో 5 రివిజన్ ఫిటిషన్లు అందాయని తెలిపారు.వాటిలో 2 సరైనవని పరిష్కరించడం జరిగిందని మరో 3 పిటీషన్లు క్షేత్ర ధృవీకరరణ కోసం పంపించినట్లు తెలిపారు.పిటిపి సమావేశానికి ముందు వాటాని కూడా క్లీయిర్ చేస్తామని తెలిపారు. ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం సర్కిల్ కార్యాలయం నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే వేదికే వైజ్ఞానిక ప్రదర్శన



మహాత్మానగర్‌లోని ఎస్వీఎస్ రెడ్ రోజ్ హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శను తిలకిస్తున్న చైర్మన్ నీలా రమేష్‌కుమార్.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :**
విద్యార్థుల్లో దాగివున్న పరిజ్ఞానాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఎస్వీఎస్ రెడ్ రోజ్ హైస్కూల్ చైర్మన్ నీలా రమేష్‌కుమార్ అన్నారు. శనివారం ఎస్పీఆర్ హిల్స్ మహాత్మానగర్‌లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన వెజ్ఞానిక ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు వారి మేథాశక్తితో పలు రకాల నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ముఖ్యంగా గ్రామీణ వాతావరణ, కలుష్య నియంత్రణ, మెట్రోరైలు, హైటెక్ సిటీ, శంషాబాద్ ఏయిర్‌పోర్టు, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతు బజార్, పండగల ప్రత్యేకత తదితర అంశాలను పొందుపర్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు వారి ఎంచుకున్న రంగాలతో పాటు వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించటం జరుగుతుందన్నారు. ప్రాంతాల బేధాలు లేకుండా కులమతాలకు అతీతంగా పండుగు పర్వదినాల ప్రత్యేకతను మన సంస్కృతి సంప్రదాయాలను అద్దంపట్టే విధంగా వివరించటం జరుగుతుంని అన్నారు. కార్యక్ర మంలో పాఠశాల డైరెక్టర్ వాణిశ్రీ, పార్వతి, మంజుల పాల్గొన్నారు.

## డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ పదవీ కాలం పొడిగింపు

**పంజగుట్ట, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):**
కజకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ జనరల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ పదవీ కాలాన్ని ఐదేళ్ల పొడిగించింది. దీంతో 2030 జనవరి వరకు ఈ పదవిలో ఉండనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కజకిస్తాన్ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ పొడిగింపు భారత్ కజకిస్తాన్ సంబంధాల బలోపేతంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా వచ్చింది. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి తదితర రంగాల్లో ఆయన రెండు దేశాల మధ్య పరస్పర సహకారం, ఆర్థిక అభివృద్ధికి దోహదపడ్డారు. తనపై ఉంచిన నమ్మకానికి కజకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు, భారత్‌లోని కజకిస్తాన్ రాయబారి నుర్లాన్ జల్గస్బాయేవ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రాజెక్టులు

**బేగంపేట ఫిబ్రవరి 22,ప్రభాతవార్త**
బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. కమీషనర్ కళాశాల విద్య నిర్వహిస్తున్న జిజ్ఞాస స్టూడెంట్స్ స్టడీ ప్రాజెక్టులలో బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిల ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి తెలియజేసారు. ఇంగ్లీషు,కెమిస్ట్రీ,మైక్రో బయాలజీ,బయో టెక్నాలజీ, కామర్స్, జువాలజీ,పొలిటికల్ సైన్స్,పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ,మాత్స్, హిందీ మరియూ కంప్యూటర్ సైన్స్ విభాగాలలో విద్యార్థినిల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి కి ఎంపిక కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేసారు.తొమ్మిది విభాగాలలోను రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందేలా విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ సబ్జెక్టుల సూపర్ వైజర్లను ,కళాశాల ప్రిన్సిపాల్,వైస్ ప్రిన్సిపాల్, జిజ్ఞాస కో ఆర్డినేటర్ ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మరియూ అధ్యాపకులు అభినందించారు.

## వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సారి అటానమస్ హోదాలో 2024 డిసెంబర్ నెలలో మొదటి సెమిస్టర్ పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ పరీక్ష ఫలితాలను శనివారం ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కె.శశికాంత్, కళాశాల ప్రిన్సిపాల్ డా. కె .ప్రభు, వీగీ అడిషనల్ కంట్రోలర్స్ డా. కమటం శ్రీనివాస్, డా. హిమబిందు, డా. శశికళ, డా. విద్యా సాగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల దివీని కుమారస్వామి, అడిషనల్ కంట్రోలర్ డా. రమావత్ శ్రీనివాస్ పరీక్షా ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మొదటిసారి పరీక్షలను విజయవంతం గా నిర్వహించిన వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బం దిని ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు అభినందించారు.

## మీ సేవ కేంద్రాలను తహసీల్దార్ తనిఖీ



మారేడ్‌పల్లిలో మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేసున్తున్న తహశీల్దార్ బీమయ్య గౌడ్

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** వివిధ సర్టిఫికెట్ల జారీ కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అభ యర్థుల నుంచి అధిక ఫీజులు వసూల్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మారేడ్‌పల్లి తహశీల్దార్ బీమయ్య గౌడ్ హెచ్చరించారు. శనివారం ఆయన మారేడ్‌పల్లి, అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాలో ఉన్న మీ సేవ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి పలు సూచనలు ఇచ్చారు. వివిధ సర్టిఫికెట్ల జారీ కోసం ఆన్‌లైన్‌లో వచ్చే రసీదు ప్రకారమే డబ్బులు తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సర్వే సింగ్‌లు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం



ఒకేలా ఉన్న కవల చిన్నారులు

**చౌటకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో శనివారం అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని హనుమాన్ నగర్‌కాలనీలో నివాసం ఉంటున్నరం రంగోళ్ల అశోక్ కుటుంబంలో కవల పిల్లలు (శానిక, స్వాతిక)లు ఒకే రూపంలో దుస్తులు ధరించి చూపరులను ఆశ్చర్యానికి గురి చేశారు. కవల పిల్లలు ఒకేలా ఉండటం, అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకేలా ఉన్నదుస్తులను ధరించడంతో ఎవరు శానిక, ఎవరు స్వాతిక అని తెలియక గ్రామస్థులతో పాటు కుటుంబ సభ్యులు సైతం తేల్చుకోలేకపోయారు.

## ప్రారంభమైన పోస్టల్ కార్డుల ఉద్యమం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల సంద ర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన హామీల్లో భాగంగా విద్యార్థులకు ఎలక్ట్రికల్ స్కూటీ హామీని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయి నందున పోస్టల్ కార్డుల ఉద్యమన్ని ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తనయ, టిఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహారెడ్డి శ్రేయరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ ప్రతి విద్యార్థినికి స్కూటీ అందిస్తామని హామి చేశారని, అధికారంలోకి వచ్చాక చేసిన హామిని అమలు చేయక పోవడం విద్యార్థినులను అవమానించడమే అని వాపోయారు. ప్రియాంక గాంధీకి పోస్టల్‌కార్డుల ద్వార చేసిన హామీని గుర్తుచేస్తూ నియోజకవర్గం వ్యాప్తంగా పోస్టల్‌కార్డులు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్వీ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు అంజాగౌడ్, జిల్లా నాయకులు అశోక్‌రెడ్డి, మండల పార్టీ యువత అధ్యక్షులు మచ్చేందర్, నాయకులు ప్రశాంత్‌సాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, చింటూ నరేష్ ప్రమోద్ గౌడ్, భూమేష్, గౌరీ ప్రసాద్, లక్ష్మణ్ నాయక్, శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు 10 పరీక్షలపై సూచనలు చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

### -సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. శనివారం మండల పరిధిలోని వెలిమెల మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాల, ఉస్మాన్‌సాగర్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలు, కళాశాలల పరిసరాలను పరిశీలించి వంట గదులను, డైనింగ్ హాల్‌లను, స్టోర్ రూంలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయులు, విద్యార్థులో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాధ్యులను ఆదేశించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకుని 10 పరీక్షలు ప్రశాంతంగా రాయాలని సూచించారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని, పరీక్షలకు హాజరయ్యే విధానం, పరీక్షలు రాసే తీరుపైవిద్యార్థులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పలువురు విద్యార్థుల నైపుణ్యాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రతి విద్యార్థి 10/10 సాధించేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ వెంట డిఈఓ వెంకటేశ్వర్లు, కళాశాల, పాఠశాల బాధ్యులు పాల్గొన్నారు.

## మహిళలతో మర్యాదగా మెలగాలి

### ఎస్‌పి రూపేష్ చెన్నూరి



ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రుద్రారంలోని గీతం ఇంజినిరింగ్ కళాశాలలో జిల్లా పోలీసులకు జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, వర్క్‌ప్లేస్‌లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి రూపేష్ చెన్నూరి మాట్లాడుతూ మహిళా సిబ్బందితో మర్యాదగా మసులుకోవాలన్నారు. మహిళలపట్ల మర్యాదగా ప్రవర్తించాలని, అసభ్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన చట్టాల ప్రకారం మహిళలపై జరుగుతున్న నేరాలకు కఠిన చర్యలు ఉన్నాయన్నారు. పోలీసు ఠాణాకు వచ్చిన ప్రతి ఒక్కరితో సిబ్బంది మర్యాదగా మాట్లాడాలన్నారు. ప్రతి ఒక్కరు పద్దతి ప్రకారం నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, డిఎస్‌పిలు రవీందర్‌రెడ్డి, సత్తయ్యగౌడ్, రామ్మోహన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు, ఎస్బీ ఇన్స్‌పెక్టర్లు, డసిఆర్బి ఇన్స్‌పెక్టర్‌ల రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ హఠావో నర్సాపూర్ కో బచావో

### అఖిలపక్షం నేత, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ కౌన్సిలర్ గోడ రాజేందర్

**నర్సాపూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :**

ప్యారానగర్‌లో నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్ హఠావో నర్సాపూర్ కో బచావో అంటూ అఖిలపక్షం నేత బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ గోడ రాజెందర్ అన్నారు. శనివారం నర్సాపూర్ ఆటవీ ప్రాంతాల్లో నల్లవల్లి ప్యారా నగర్ శివారులో నిర్మిస్తున్న జిహెచ్ఎంసి డంప్ యార్డు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ బస్టాండ్ ఎదురుగా అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆరవ రోజుకు చేరుకుంది. ఈ రిలే నిరాహార దీక్ష కు బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ప్రధానోపాధ్యాయులు గుండంమోహన్ రెడ్డిలు హాజరై ఈ రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ కౌన్సిలర్ గోడ రాజేందర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ తో నర్సాపూర్ కే ఎక్కువ నష్టం వాటిల్లుతుందని అన్నారు. రాయరావు చెరువు, నర్సాపూర్ ప్రాంతం, పరిసర గ్రామాల్లో వాతావరణం మొత్తం కాలుష్యం మయమై ప్రజలకు ఎన్నో ఇబ్బందులు కలగజేస్తాయని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రజలకు వాతావరణానికి ముప్పు కలిగించే ఈ డంపు యార్డును వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నర్సాపూర్ అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గోడ రాజేందర్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు రిజ్వాన్. లాయర్ ఆనంద్ కుమార్. సింగిల్ విండో డైరెక్టర్ కమ్మరి కృపాచారి. గంగపుత్ర నాయకులు కొండి కుమార్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు




రిలే నిరాహార దీక్షలు పాల్గొన్న అఖిల పక్షం నాయకులు తదితరులు

## స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలు అందజేసి ఉపాధి అవకాశాలు పెంచాలి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ నిర్దేశించిన బ్యాంకు లింకేజీ రుణాలను సకాలంలో అందించి ఉపాధి అవకాశాలు పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జిల్లా స్థాయి సెర్ప్, మెప్మా ఉద్యోగుల సమావేశంలో ఎస్‌హెచ్‌జి బ్యాంకు లింకేజీ రుణాలను, ఇందిరా మహిళా శక్తి ఫుడ్ ప్రాసెసింగ్ ,పాడి పశువుల కొనుగోలు యూనిట్స్, యూనిఫారం స్టిచింగ్‌పై మండల స్థాయిలో ఎపిఎం.సీసీలతో సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.895.61 కోట్ల ఎస్‌హెచ్‌సి బ్యాంకు లింకేజీ రుణాలను అందించాల్సి ఉండగా రూ.831.98 కోట్ల రుణాలను అందించడం జరిగిందని మిగితా రూ.63.62 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను మార్చి 7లోపు అందించి వంద శాతం టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలలో ప్రత్యేక చొరవ చూపి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ గ్రౌండ్ జరిగేలాచూడాలన్నారు. పాడి పశువుల యూనిట్స్ వచ్చే సమావేశంలోపు గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. డిఆర్‌డిఓ జయదేవ్ అర్య, లిడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు, మెప్మా అధికారి హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేంద్రరెడ్డిని గెలిపించాలి

### మంత్రులు దామోదర రాజనర్సింహా, కొండా సురేఖ



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహా

**కొండాపూర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్కాపూర్ శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేంద్రరెడ్డి తరపున ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేంద్ర రెడ్డిని భారీ మెజారిటీతో గెల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ 56 వేల ఉద్యోగాలను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని, ఉద్యోగులు, టీచర్లు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే మీ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, పట్టభద్రుల నియోకవర్గంలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు ఉన్నత ఉద్యోగాలు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ చైర్మన్ కుమార్, రాంచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్‌డిఓ

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఓ రమాదేవి శనివారం పరిశీలించారు. ఈ సంద్భంగా పాఠశాల విద్యార్థులతో ఆర్‌డిఓ మాట్లాడుతూ వారికి అందుతున్న మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పెండింగ్ పనులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ధరఖాస్తులు,చెక్కుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మీ సేవ డాష్ బోర్డు, నిర్ణీత సమయంలో ధరఖాస్తులను త్వరిత గతిన పరిష్కారించాలని ఆదేశించారు. వ్యవసాయ యోగం కాని భూముల సమాచారం, పాక్షిక వ్యవసాయ యోగ్యం కాని భూముల ఆన్‌లైన్ పురోగతిపై పలఆర్‌బిరేషన్ కేసుల సమాచారం, కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఆర్ఐ సందీప్, శరణప్ప, సీనియర్ అసిస్టెంట్ వరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ లింగమణి, రెవిన్యూ సిబ్బంది సాయిలు, కృష్ణ, స్వాతి, రాధాకృష్ణ, సర్వేయర్ రాజు నాయక్, ఆపరేటర్ రాజు, యశ్వలత పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఓ రమాదేవి



విచారణలో పాల్గొన్న సొసైటీ మాజీ చైర్మెన్, ఇఫ్కో డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డి

### కోనాపూర్ సహకార సంఘంలో

## మూడవరోజు కొనసాగిన విచారణ

### సొసైటీ మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డిని విచారించిన అధికారులు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :**

రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన రెండు కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగం ఆరోపణల్లో భాగంగా జరుగుతున్న విచారణ మూడవరోజు కొనసాగింది. శనివారం నాడు అధికారుల విచారణలో సొసైటీ మాజీ చైర్మెన్, ఇఫ్కో డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా కోనాపూర్ సొసైటీలో రెండు కోట్ల 26 లక్షల రూపాయల నిధులు దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ ప్రారంభించడం జరిగిందని అధికారి పేర్కొన్నారు. ఈవిచారణలో భాగంగా ఈరోజు సొసైటీ మాజీ చైర్మెన్ దేవేందర్‌రెడ్డి, మాజీ సీఈవో గోపాల్‌రెడ్డితో పాటు సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్‌పంపు నిర్వాహకులను వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. విచారణలో వారు ఇచ్చిన వివరాలతో నివేదికను పై అధికారులకు పంపించడం జరుగుతుందని ఆయన వివరించారు.

## రంజాన్ మాసానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్



మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** మార్చి మొదటి వారం రంజాన్ ప్రారంభం నుంచి ముగిసేవరకు రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. రంజాన్ నెల ప్రారంభం నుంచి పండుగ ముగిసే వరకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మసీదు పరిసరాల్లో శానిటేషన్ పనులు చేపట్టడం తోపాటు నీటి సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో డిపిఒ, మున్సిపాలిటీల్లో కమిషనర్లు ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. మాసంన మొత్తం ఉదయం, సాయంత్రం ప్రార్థన సమయాల్లో విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలో కిరాణా దుకాణాలు, క్లాత్ షోరూంలు రాత్రి వేళాల్లో కొంత సమయం తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని లేబర్ శాఖ అధికారులకు సూచించారు. రంజాన్‌మాసంలో జనాల తాకిడి ఎక్కువగా ఉంటుందని హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలకు భంగం కలగకుండా అప్రమత్తంగా ఉండేలా గట్టి బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ముస్లిం కమిటీ పెద్దలు అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు.

సమావేశంలో ఆర్డీఓలు సదా నందం, చంద్రకళ, ఎసిపిలు మధు, పురుషోత్తం రెడ్డి, సతీష్, డిపివో దేవకీదేవి, డిఎం అండ్ హెచ్ఓ పల్వాన్ కుమార్, ఎఒ అబ్దుల్ రహమాన్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ముస్లిం కమిటీల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రోహిత్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయకమిటి సభ్యులు

## ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** మండలపరిధిలోని రుద్రారం గ్రామంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించే శ్రీ సంగమేశ్వర స్వామి 76వ ఆలయ వార్షికోత్సవ వేడుకలకు రావాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రికను అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి మంచాల లక్ష్మణ్ సిద్దిరాములు, నవీన్, రవి, శ్రీనివాస్ ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు, నిందితుడితో పోలీసులు

## అంతర్ జిల్లా మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

### 5 మోటార్ సైకిళ్ల స్వాధీనం : వివరాలు వెల్లడించిన ఎసిపి మధు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** సిద్దిపేటలోని పలు ప్రాంతాల్లో 5 మెటార్ సైకిళ్లను దొంగిలించిన అంతర్ జిల్లా మోటార్ సైకిళ్ల నిందితుడిని టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు సిద్దిపేట ఎసిపి మధు తెలిపారు. శనివారం విలేకరులకు ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన ఆస సుదర్శన్(32) అనే నిందితుడు పట్టణంలో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. టెలికమ్ నగర్‌కు చెందిన సన్నవల దయానందం తన బైక్ చోరీకి గురైనట్లు టూ టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ధర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. టూ టౌన్ సీఐ ఉపేందర్‌కు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు రాజీవ్ రహదారిలో డబుల్ బెడ్ రూంల దగ్గరలో నిందితుడు పల్సర్ బైక్‌పై వెళ్తుండగా సుదర్శన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారని తెలిపారు. నిందితున్ని అరెస్టు చేసి 5 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుదర్శన్ గతంలో సైతం పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. మోటార్ సైకిళ్ల దొంగను అరెస్టు చేయడంలో కీలక పాత్ర వహించిన సీఐ ఉపేందర్, సిబ్బంది కనకరాజు,ప్రశాంత్, సుధాకర్‌రెడ్డిలను అభినందించి నగదు రివార్డును అందజేశారు.

## ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి



ఆసుపత్రిలో చికిత్స పొదుతూ మృతి చెందిన సాయాగౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** కులవృత్తిలో భాగంగా కల్లుగీయడానికి ఈతచెట్టు పైకి ఎక్కి ప్రమాదవశాత్తు జారి కిందపడి ఒక కల్లు గీతా కార్మికుడు మృతిచెందిన సంఘటన రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బండి సాయాగౌడ్ రోజుమాదిరిగానే కల్లు గీయడానికి ఈతచెట్టు పైకి ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, వెంటనే స్పందించిన రామాయంపేట 108 సిబ్బంది అక్కడికి చేరుకొని, రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయాగౌడ్ మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తాలో శనివారం జరిగింది. శాలిపేటకు చెందిన యువకుడి ద్విచక్ర వాహన గవ్వలపల్లి వద్దకు రాగానే అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. అదే సమయంలో చిన్నశంకరంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించడానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న పవన్ కింద పడిన ద్విచక్రవాహనాన్ని ఢీకొని కిందపడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## అక్రమంగా డంపు చేసిన ఇసుక సీజ్

### ఇద్దరిపై కేసు నమోదు

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** అక్రమంగా డంపు చేసి ఉంచిన 20టన్నుల ఇసుకను పోలీసులు సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. మండలంలోని జాలపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయం సమీపంలో గ్రామానికి చెందిన తుపాకుల శ్రీనివాస్,పోతన యాదగిరి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను డంపు చేశారని నమ్మదగిన సమాచారం అందడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు మద్దూరు పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి డంపు చేసి ఉంచిన ఇసుకను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.



అక్రమంగా డంపు చేసిన ఇసుకను చూపిస్తున్న పోలీసులు



భైరి శంకర్‌ను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

## బిజెపి జిల్లా అధ్యక్షుడికి సన్మానం

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన భైరి శంకర్‌ను శనివారం ఆ పార్టీ నాయకులు మామిండ్ల నాగముదిరాజ్, మర్కంటి ఏగొండ, కాశమైన నవీన్, తుప్పటి నరేష్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా బిసి సామాజికవర్గానికి అవకాశం కల్పించిన ఎంపి రఘునందన్‌రావు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో బిజెపి మరింత బలపడుతుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలకు కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఛలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుఎస్‌ఎఫ్ఐ నాయకులు

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** మార్చి 27న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను యుఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్, గణేష్, శేఖర్, జగన్, రాకేష్, ప్రశాంత్, శ్రీనివాస్, నరేష్, అభి తదితరులు పాల్గొన్నారు.

## పాములపర్తిలో స్వయం పరిపాలన దినోత్సవం

**మర్కుక్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఇందులో డీఈఓగా పి.సాయికుమార్, డిప్యూటీ డీఈఓగా జె.సాయితేజ, ఎంఈఓగా జి.లిల్లీ, ప్రధానోపాధ్యాయులుగా ఎ.అమూల్యతోపాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా, పీఈటీలుగా విధులు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపికచేసి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు షేక్‌లతిసైదా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని నిరంతరం ప్రయత్నం చేయాలని సూచించారు.

## దళితవాడకు నీటి సరఫరా చేయాలి



ఎంపిడిఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**మర్కుక్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలోగల 8వ వార్డు దళితవాడకు నీటి సరఫరా చేయాలని కెవిపిఎస్ మండల అధ్యక్షుడు పొట్టోళ్ల దాసు శనివారం ఎంపిడిఓ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం పైప్‌లైన్ డ్యామేజ్ కావడంతో పది కుటుంబాలకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. పలుమార్లు అధికారులకు, పంచాయతీ కార్యదర్శి, మిషన్‌భగీరథ అధికారులకు తెలిపినప్పటికీ ఫలితం లేదన్నారు. రానున్నది ఎండాకాలమని దళిత వాడకు నీటి సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## గుడి స్థలాన్ని ఆక్రమించి విక్రయించిన కాంగ్రెస్ నేత

### ఆర్డీవోకు గ్రామస్థుల ఫిర్యాదు..చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** గుడి స్థలాన్ని ఆక్రమించి కబ్జాచేసిన కాంగ్రెస్ నాయకుడు అదే స్థలాన్ని మరో వ్యక్తికి విక్రయించిన సంఘటన మండలంలోని గాంధీనగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకివెళ్తే మండలంలోని గాంధీనగర్ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు బొంగోని శ్రీనివాస్ పోచ్చమ్మ గుడి పక్కనే ఉన్న మైసమ్మ గుడి స్థలాన్ని ఆక్రమించారని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గుడిస్థలాన్ని తిరిగి గుడికి కేటాయించాలని కోరుతూ మాజీ ఎంపిటిసి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ కోతి రాంచంద్రం, సిపిఐ నేత పాయకులు కుమారస్వామి శుక్రవారం హుస్నాబాద్ ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా శనివారం సర్వే నిర్వహించారని, సర్వే చేసిన అధికారులు అది ప్రభుత్వ స్థలం 286వ సర్వే నంబర్‌లో ఉందని, అయితే తన భార్య సర్పంచ్‌గా ఉన్న సందర్భంలో ఆ భూమిపై కన్నేసిన శ్రీనివాస్ గ్రామ పంచాయతీ రికార్డులలో 286వ సర్వే నంబరుకు బై 1గా మార్చి గ్రామ పంచాయతీ రికార్డులో నమోదు చేసుకుని ఇటీవల వొడ్డెర కులానికి చెందిన వ్యక్తులకు అమ్ముకున్నట్లు తమకు తెలిసిందన్నారు. ఇదే శ్రీనివాస్ తన హయాంతోపాటు భార్య సర్పంచ్‌గా ఉన్నప్పుడు కూడా ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని విక్రయించారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని అందులో దేవాలయానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించడంతోపాటు విక్రయించిన విషయంలో ఆతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తిరిగి ఆ స్థలాన్ని దేవాలయానికి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## సిసిఐ పత్తి కొనుగోళ్లపై విచారణ జరిపించండి

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మార్కెట్ యార్డులో సిసిఐ ద్వార కొనుగోళ్లు చేసిన పత్తి విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ బిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ అయిలేని మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసిఐ ద్వార కొనుగోళ్లు చేసిన పత్తి విషయంలో కొంత మంది అధికారులు, నాయకులు, దళారులు కుమ్మక్కై వ్యవసాయశాఖ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి లక్షల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కుమ్మకైన నాయకులు, దళారులు, అధికారులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యుతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ గాల్‌రెడ్డి, లక్ష్మణ్, సునీత తదితరులు ఉన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బిఆర్‌ఎస్ నేతలు

# ఎలక్ట్రికల్ వాహనాల తయారీలో ఇంజనీర్ల పాత్ర కీలకం

**నర్సాపూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ప్రస్తుత ఆటోమేటిక్ ఈ ఎలక్ట్రికల్స్ వెహికల్స్ తయారీ రంగాలలో ఇంజనీర్స్ పాత్ర కీలకమని మారుతిసుజుకి సిటిఓ సివి రామన్ అన్నారు నర్సాపూర్ బి.వి.ఆర్.ఐ.టి కళాశాలలో కొనసాగుతున్న ఈ బహ సే ఇండియా పోటీలు మూడవ రోజు స్టాటిక్ అండ్ డైనమిక్ ఈవెంట్స్ సదస్సుకు ముఖ్య అతిథిగా మారుతి సుజుకి సిటిఓ సివి రామన్ హాజరై మాట్లాడుతూ అన్ని జట్ల విద్యార్థులను పూర్వ విద్యార్థుల కమిటీలను సాంకేతిక బృందాలను న్యాయమూర్తులను కలసి ఈవెంట్ గురించి వాటి ప్రాముఖ్యతను ఎలక్ట్రికల్ ఆటోమేటిక్ రంగాలలో ఉద్యోగ అవకాశాలను ప్రస్తుతం ఆటోమేటిక్ ఈ ఎలక్ట్రికల్ వెహికల్స్ గురించి తన అనుభవాలను విద్యార్థులతో కలిసి వారి అనుభవాలను పంచుకుని విద్యార్థులను అభినందించారు అదేవిధంగా ఆటోమేటిక్ ఈ ఎలక్ట్రికల్ వెహికల్స్ రంగాలలో ఎన్నో ఉద్యోగ అవకాశాలున్నాయని ఆయన గుర్తు చేశారు మెకానికల్ ఎలక్ట్రికల్ ఎన్నాల్యూమినేషన్ పద్ధతులను పరిశీలించి పలు సూచనలను సలహాలను ఇచ్చారు. ఈ బాహ సే ఇండియా 2025 మూడవరోజు విద్యార్థులు ముందుకు సాగడం వల్ల ఉత్తేజ పరమైన పరిణామాలు జరిగాయి ఇంజనీరింగ్ పనితీరు,పరిమితులు ఈవెంట్ సాంకేతిక సవాల నుండి అధిక అంచనాలతో పోటీ జట్లలో అత్యుత్తమ ప్రదర్శనను అందించడం విద్యార్థులు ఖచ్చితమైన పనితీరును ప్రదర్శించడం యాక్సిడెంట్ యుక్తి స్లైడ్ ఫుల్ సస్పెన్షన్ అండ్ ట్రాక్షన్ వంటి కీలకమైన పరీక్షలు నిర్వహించబడ్డాయి అన్నారు ఈ కార్యక్రమంలో విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కళాశాల డైరెక్టర్ లక్ష్మి ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజ్, ఏవో సురేష్ ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థినిలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు





బగ్గీల వాహనంతో పాటు విద్యార్థులు, నిర్వాహకులు తదితరులు



మాట్లాడుతున్న ఎస్సై షేక్ మహబూబ్

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ అన్నారు. శనివారం బైరాన్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరు కలిసి మెలసి ఉండాలని వాటిని అడ్డుపెట్టుకుని గొడవలకు దిగొద్దని అన్నారు.శాంతియుత వాతావరణంలో ఎన్నికల జరిగేలా గ్రామస్తులు సహకరించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని,గ్రామంలో ఎవరైన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మాజీ జడ్‌పిటిసిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూర్ మండల మాజీ జడ్పీటీసి గిరి కొండల్‌రెడ్డి తల్లి మధురమ్మ ఇటివల అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం జాలపల్లి గ్రామంలోని స్వగృహంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు.కాంగ్రెస్ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్య : ఎంపిడివో

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త :** ప్రైవేటు పాఠశాలలో కంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపిడీవో రామ్మోహన్ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో శనివారం కై ఆర్గనైజేషన్ సీఆర్పీ నారదాసు ఉమాదేవి అధ్యక్షతన ఈసీసీఈడే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడీవో హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధునిక బోధన పరికరాల ద్వారా విద్యను అందించడంతో వారిలో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఐదు సంవత్సరాలు వచ్చేవరకు అంగన్వాడీ కేంద్రాల్లోనే చదివించాలన్నారు. అనంతరం ఆయన బోధనా పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి సిద్దేశ్వర్,టెక్నికల్ అసిస్టెంట్ వెంకటమ్మ,అంగన్వాడీ ఉపాధ్యాయులు దుర్గాభవాని,లక్ష్మి,రజిత,ఫీల్డ్ అసిస్టెంట్ బాలకిషన్ ఉన్నారు.

## సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ : సిఐ

**రాయపోల్ ఫిబ్రవరి 22ప్రభాతవార్త:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తొగుట సిఐ లతీఫ్ అన్నారు. శనివారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో ఎల్లమ్మ దేవాలయంలో గౌడ కులస్థులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రాయపోల్ ఎస్ రఘుపతి,గౌడ కులస్థులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు.ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు.ప్రతి గ్రామంలో ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయా దేవాలయ కమిటీ సభ్యులకు సూచించారు.ఆనంతరం సీసీ కెమెరాలను ఏర్పాటు గౌడ కులస్తులను ఆయన ఆభినందించారు

## కానుకుంటలో కళాకారులకు డప్పులు అందజేత

**గుమ్మడిదల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కానుకుంట గ్రామంలో ఎస్సీ సోదరులకు 24 మంది కుటుంబాలకు 24 డప్పులు తన సొంత నిధులు వెచ్చించి ఇవ్వడం జరిగిందని తాజా మాజీ ఉప సర్పంచి, తాజా మాజీ మండల బీజేపీ అధ్యక్షుడు పలుగు గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక వృత్తి కలిగి ఉంటారని, వారికి చేయూత అందిస్తే జీవనోపాధి కల్పించినవారం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కానుకుంట గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షులు సోమల యాదగిరి, తోటపల్లి సాయిరాం రెడ్డి, ఆకుల నాగరాజ్, మాధవరెడ్డి, ప్రవీణ్ కుమార్, గుండగల్ల వెంకటేష్, లసంగుల యాదగిరి, కాలకంటి రమేష్, పోతురాజు నవీన్, ఎర్రోళ్ల నరేష్ బాబు, ఎర్రోళ్ల ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు కృషి చేసిన ఎన్ఆర్ఐ

**చేర్యాల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పది న్యూ మోడల్ కంప్యూటర్ సిస్టమ్స్‌ను అందించి కంప్యూటర్ ల్యాబ్‌ను ఎన్ఆర్ఐ ప్రొఫెసర్ పి.ప్రతాప్‌రెడ్డి ఆయన సతీమణి బాలమణితో కలిసి శనివారం ప్రారంభించారు.అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో పిల్లల ఉపాధి కోసం కంప్యూటర్ శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్స్‌పల్ కె.ప్రణీత, కంప్యూటర్ విభాగం హెచ్ఓడి డి.నరేష్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుకు కంప్యూటర్ స్కిల్స్, అధునాతన కోర్సులు నేర్చుకోవడానికి ఈ సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం,విద్యార్థులు వారికి ప్రత్యేక కృజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ముస్త్యాల మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి,కళాశాల అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు పలకాలి

### -పట్టభద్రుల సమావేశంలో ఎంపి, మాజీ మంత్రి

**జహీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వూట్కూరి నరేందర్‌రెడ్డికి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యాత ఓటు వేసి శాసనమండలి మెట్టు ఎక్కేలా చేయాలని ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని సిద్ది హోటల్‌లో నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించిందని దుయ్యబట్టారు. నిరుద్యోగుల మద్దతుతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వారి సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. నరేందర్‌రెడ్డికి శాసన మండలికి పంపాలని పట్టభద్రులకు వినతి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర సెట్విన్ చైర్మణ్ గిరిధర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివచరణ్‌రెడ్డి, డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, టిజిఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, ఝరాసంగం, జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల కాంగ్రెష్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, రామలింగారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ మక్సుద్ ఆహ్మద్, నర్సింహారెడ్డి,పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా అంజిరెడ్డికి మద్దతు పలకండి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మద్దతులో బరిలో ఉన్న సి.అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యాత ఓటు వేసి మద్దతు పలకాలని పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్ శనివారం ప్రచారం నిర్వహించారు. శనివారం నారాగిరి పట్టణంలో పట్టభద్రుల నివాసానికి వెళ్లి బిజెపి అభ్యర్థికి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి ఓబి సమాచార రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ ఉన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను బలపర్చండి

**పాపన్నపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఈనెల 29వ తేదీన జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు పలకాలని బిజెపి మాజీ మండల అధ్యక్షులు సంతోష్ అన్నారు. మండల పరిధిలోని మల్లంపేట, కందిపల్లి, మిన్పూర్, పాపన్నపేట గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల పార్టీ మాజీ అధ్యక్షులు సంతోష్, పాపన్నపేట మాజీ సర్పంచ్ ఇమానియల్, జిల్లా నాయకులు సుధాకర్, భాగేష్, వడ్ల భాగేష్‌లు ప్రచారం నిర్వహించారు.

## పట్టభద్రులను కలిసిన మాజీ ఎంపి బిబి పాటిల్

**సిర్గాపూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పట్టభద్రుల బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి సి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు పలకాలని సిర్గాపూర్‌లో శనివారం పట్టభద్రులను మాజీ ఎంపి బిబిపాటిల్ వినతి చేశారు. సిర్గాపూర్‌లోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి బిబి పాటిల్ హాజరై పట్టభద్రులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంతో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు.ఎన్నికల్లో ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఓటర్లు, బిజెపి నాయకులు అరుణ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డి మద్దతుగా కాంగ్రెస్ నేతల ప్రచారం

**వెల్దుర్తి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు కాంగ్రెస్ అభ్యర్థులకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలే అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తాయన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు సుధాకర్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మహేష్ రెడ్డి, మాజీ నాయకుడు నరసింహారెడ్డి, మల్లేశం, కృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యావేత్త ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

**గజ్వేల్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):**

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా అనేక మంది విద్యార్థులకు విద్యను అందిస్తున్న ఆల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర విద్యాసంస్థలకు ధీటుగా విద్యాబోధన అందించేందుకు కరీంనగర్‌లో నరేందర్‌రెడ్డి విద్యాసంస్థలను ఏర్పాటుచేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక విద్యా సంస్థలను ఏర్పాటుచేసి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారన్నారు. విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకువచ్చే విధంగా కృషి చేశారన్నారు. గజ్వేల్ పట్టణంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్‌గౌడ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది ఎన్నెల్లి స్వామి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో కన్నుల పండువగా శివపార్వతుల కళ్యాణం

**నర్సాపూర్, ఫిబ్రవరి 22. ప్రభాతవార్త :** పట్టణంలోని శివాలయంలో పూజారి శివదీక్ష గురుస్వామి వీరప్ప గురుజీ ఆధ్వర్యంలో శివదీక్ష స్వాముల సమక్షంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కనుల పండుగ జరిగింది. ఈ కళ్యాణోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని శివ పార్వతుల కళ్యాణాన్ని వీక్షించారు.మహిళలు పెద్ద సంఖ్యలో శివపార్వతుల కళ్యాణానికి తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా శివాలయ పూజారి శివదీక్ష గురు స్వామి వీరప్ప గురు స్వామి మాట్లాడుతూ ఈ శివాలయంలో శివదీక్ష మాలాధారులు భక్తజనం నేడు రేపు ఈ శివాలయంలో జరిగే పూజా కార్యక్రమాలకు పెద్దఎత్తున హాజరై శివుడు అనుగ్రహం పంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులందరు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా నర్సాపూర్ అటవీ ప్రాంతంలో వ్యారానగర్ వద్ద నిర్మిస్తున్న దంపు యార్డు రద్దు చేయాలని ఈ ప్రాంతం నుండి తరలించాలని కోరారు. కార్యక్రమంలో శివదీక్ష మాలధారులు రింగుల ప్రసాద్ స్వామి, నాగరాజు స్వామి, రమేష్ యాదవ్ స్వామి, టిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సత్యం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శివదీక్ష మాలధారులు, మహిళలు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శివపార్వతుల కళ్యాణంలో ఒడిబియ్యాన్ని సమర్పిస్తున్న మహిళలు



విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

## అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### సిఐ కోండ్ర శ్రీనివాస్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** అపరిచిన వ్యక్తుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సిఐ కోండ్ర శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని కెజీవిబి(కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాల)లో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, బాలికలు, మహిళలకు ఉన్న చట్టాలు, సైబర్‌నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, గంజాయి, సిసి కెమేరాలు, ఈవి టీజింగ్, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మనిషి అమ్మాయిలు అకతాయిల అల్లర్లు, పొగడ్తలకు పడిపోయి మోసపోవద్దన్నారు. ప్రతీ విద్యార్థి వారికి ఉన్న హక్కులను చట్టాలను గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను సరైన దారిలో నడిపించాల్సిన బాద్యత తల్లితండ్రులతో పాటు అధ్యాపకులకే ఉంటుందని గుర్తు చేశారు. ఎవరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, నిబందనలు ఉల్లగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరికైనా ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే డయల్ 100 లేదా 8712667434 నంబర్లకు ఫోన్ చేసి పోలీసులు సహకారం తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మమత, షీటీ మ్ బృంధం సదయ్య,ప్రశాంతి,కృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు టేబుళ్లు అందజేత

**గజ్వేల్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్ ప్రభుత్వ పాఠశాలకు అనంతోజు శ్రీనివాస్, లాస్య దంపతులు శనివారం కుర్చీలు, టేబుళ్లు, బీరువా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు లేకపోవడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులకు కనీసం కూర్చోవడానికి కుర్చీలు, టేబుళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని, జనవరి 26న జెండా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన తనకు ఈ సమస్యను వివరించగా వెంటనే స్పందించి సుమారు రూ.50వేల విలువైన సామాగ్రిని అందజేసినట్లు తెలిపారు. పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌చారి పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని, దాతల సహకారం కోసం అతను తీవ్రంగా కృషి చేస్తున్నాని, అలాంటి వారు ఉండడం వల్లే నేను ఈ సహాయం అందించానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహదేవుని భాస్కర్, ఉపాధ్యాయులు మంజుల, రేణుఖ, ఎన్.ప్రభావతి, డి.గీతామాధురి, సిహెచ్.శ్వేత, శ్రీఖరి, సిరిమిల్ల అశోక్, సిఆర్‌పి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడానికి ముందుకు రావాలి

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త :** పేదలకు సేవచేయడానికి సంపన్నులు ముందుకు రావాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి అన్నారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సమన్వయ కర్త పుల్లూరు శివకుమార్ ఆర్థిక సహాయంతో శనివారం వాసవీక్లబ్, వాసవీ క్లబ్ వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వైశ్యభవన్ గోశాలలో గోవులకు ఆహారంగా ఆకుకూరలు, కూరగాయాలు అందజేశారు. అలాగే నూతన వధువు వివాహ నిమిత్తం 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీక్లబ్, వాసతి వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో కుల మతాలకు అతీతంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల నాయకులు పుల్లూరి శశాంక్, చింత రాజేంద్రప్రసాద్, చకిలం రవి, అర్వపల్లి హరికిరణ్, పుల్లూరి నాగరాణి, మురంశెట్టి కుమార్, చిగుళ్ళపల్లి మంజుల, చిగుళ్లపల్లి సత్యనారాయణ, బెజగాం రూపా, బెజగాం రమేష్, మర్యాల వీరేశం, స్వప్న, పెద్ది శ్రీనివాస్, గౌరిశెట్టి దామోదర్ పాల్గొన్నారు.

## ప్రసన్న హరికృష్ణ బిజెపితో కుమ్మక్కయ్యారు

### -బిసి కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు హరిప్రసాద్



మాట్లాడుతున్న హరిప్రసాద్

**గజ్వేల్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్దార్ రవీందర్ సింగ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బిసి కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిసిల ముద్దుబిడ్డ సర్దార్ రవీందర్‌సింగ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కరీంనగర్ పట్టణాన్ని రోల్‌మోడల్ సిటీగా తయారుచేశారన్నారు. ఐదుసార్లు పాలకవర్గ సభ్యులుగా, ఒకసారి కార్పొరేటర్‌గా, ఒకసారి మేయర్‌గా కరీంనగర్ పట్టణ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారని తెలిపారు. అలాగే 42 ప్రభుత్వ పాఠశాలల్లో సరస్వతి ప్రసాదం పేరుతో విద్యార్థులకు టిఫిన్స్, స్నాక్స్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా చనిపోతే ఒక్క రూపాయితో అంత్యక్రియలు చేసే పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత సర్దార్ రవీందర్‌సింగ్‌దే అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవకై ముందుకు పోతున్న సర్దార్ రవీందర్‌సింగ్‌ను గెలిపించే బాధ్యత బిసిలదే అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ బరిలో ఉన్నారని, అతను కోచింగ్ సెంటర్లకు అమ్ముడుపోయి లక్షల రూపాయలు దండుకున్నారన్నారు. అతను ఒక బడి దొంగ అని విమర్శించారు. ప్రసన్న హరికృష్ణ బిజెపితో కుమ్మక్కయ్యారన్నారు. అలాంటి వారికి ఓటు అడిగే నైతిక హక్కు లేదని, బడుగు, బలహీన వర్గాల అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్‌ను గెలిపించే బాధ్యత మనందరిదన్నారు. ఆయనతో పాటు బిసి సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**నర్సాపూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సమరయోధులు భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి వర్యులు భారతరత్న మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం నర్సాపూర్ మండల పరిధిలోని అహ్మద్ నగర్ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ఇందులో భాగంగా విద్యార్థులే స్వయంగా ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థులు ఉపాధ్యాయులుగా ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్ గణేష్, సయ్యద్ పాషా, ముకుందరావు, శ్రీ హర్ష రెడ్డి, రమ్య ,అరుణాదేవి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు





స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు,ఉపాధ్యాయులు



చౌటకూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఓ పాండు

## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌డిఓ

**చౌటకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్‌డిఓ పాండు పరిశీలించారు. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయని, ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్‌డిఓ వెంట తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఆర్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ఎంపిడిఓగా ఎంపిఓ హమీద్ హుసేన్



ఇన్‌చార్జి ఎంపిడిఓగా హమీద్‌హుస్సేన్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న సీఈఓ

**మనూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఎంపిఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న హమీద్‌హుసేన్‌కు ఇన్‌చార్జి ఎంపిడిఓగా బాధ్యతలు అప్పగిస్తూ శనివారం జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన హమీద్‌హుస్సేన్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటానన్నారు.

## ఘనంగా కాశీ విశ్వనాథ ఆలయ వార్షికోత్సవం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండలపరిధిలోని పోతాన్‌పల్లి(ఆర్)లో శ్రీకాశీవిశ్వనాథ ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు శనివారం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తనయ, బిఆర్‌ఎస్ యువ నాయకురాలు మహారెడ్డి శ్రేయరెడ్డి హాజరై ప్రత్యేక పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, టిఆర్‌ఎస్వీనియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, పార్టీ యువత మండల అధ్యక్షుడు మచ్చేందర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, శంకర్, ప్రశాంత్ సాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, చింటూ నరేష్, ప్రమోద్‌గౌడ్, బూమేష్ పాల్గొన్నారు.

**ఆలయంలో పూజలు నిర్వహించిన చంద్రశేఖర్‌రెడ్డి...**

పోలన్‌పల్లి గ్రామంలోని శివాలయంలో శనివారం నిర్వహించిన ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవ పూజా కార్యక్రమాలకు హాజరైన చంద్రశేఖర్‌రెడ్డిని ఆలయ కమిటి బాధ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరారెడ్డి, భూమ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, పండరి తదితరులు పాల్గొన్నారు.

## సింగూరు పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



సింగూరు పాఠశాలలో స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**పుల్‌కల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సింగూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు భోదించి అందరిని ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా అబ్దుల్, ఉపాధ్యాయులుగా శ్రీవర్షిణి, సుచిత్ర, అక్షిత, నందిని, పూజ, స్పందన, స్వాతి, శివలీలా, శ్రీ లక్ష్మిలు బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వర్, ఉమారాణి, మధులత, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దినకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మదూర్ పరిధిలోని 33/11 కేవి విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం చెన్నాయపల్లి, వెంకట్‌రావుపల్లి, మదూర్ గ్రామాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు, రైతులు సహకరించాలని వారు కోరారు.

## చిన్న కుటుంబం... పెద్ద కష్టం

### ఇంటి పెద్దకు క్యాన్సర్..దాతల సహాయం కోసం ఎదురు చూపులు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఓ నిరుపేద కుటుంబానికి అనారోగ్య రూపంలో పెద్ద కష్టం వచ్చి పడింది. ఇంటి యజమాని క్యాన్సర్ బారిన పడటంతో పోషణ కష్టతరమైంది. రోజూ పనిచేయకపోతే పూట గడవని పరిస్థితి. వైద్యం చేయించుకునేందుకు లక్షలాది రూపాయల ఖర్చును భరించలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన మహేశ్వరి, సురేష్ దంపతులు. వారికి కొడుకు పవన్, కుమార్తెలు లావణ్య, వైష్ణవి ఉన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం బతుకు దెరువు నిమిత్తం భాగ్యనగరానికి వలస వెళ్లి కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తూ, పిల్లల్ని చదివిస్తున్నారు. కొన్ని నెలల క్రితం సురేష్ అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా గొంతు క్యాన్సర్ అని వైద్యులు తెలిపారు. ఆరు నెలలుగా భాగ్యనగరంలోనే పని చేసుకుంటూ వచ్చినంతలోనే కుటుంబ పోషణ, వైద్యం చేయించుకున్నాడు. అనారోగ్యం తీవ్రం కావడంతో కూలి పనులకు వెళ్లలేని స్థితికి చేరుకున్నాడు. చేసేది ఏమిలేక సురేష్, భార్య, పిల్లలతో కలిసి స్వగ్రామమైన చిన్నశంకరంపేట పట్టణానికి వచ్చి అద్దె ఇంటిలో ఉంటున్నాడు. గతంలో తనకంటూ ఇల్లు ఉండగా చెల్లెళ్ల పెళ్లికి అమ్మేసి వారి వివాహాలను జరిపించారు. ఇప్పుడు పిల్లల్ని స్వగ్రామాని తీసుకురావడంతో వారి చదువులు సైతం ఆగిపోయాయని దంపతులిద్దరు ఆవేదన వ్యక్తం చేశారు. తినడానికి తిండి లేదు, ఉండటానికి ఇల్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల వారు అన్నం పెడుతున్నారని, ప్రభుత్వం, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



క్యాన్సర్‌తో బాధపడుతున్న సురేష్‌తో కుటుంబ సభ్యులు

# తాగునీటి ఎద్దడి నివారణ బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు అప్పగించండి

**కౌడిపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

రాష్ట్ర వ్యాప్తంగా నేడు పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ అభివృద్ధి పనులను తమ వేతనాలతో చేయించినప్పటికీ బిల్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున, ప్రస్తుత వేసవిదృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యల బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు అప్పగించాలంటూ వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఓ శ్రీనివాస్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ గత వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకుంటూ గ్రామానికి దగ్గరలోగల వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకుని ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయమని జిల్లా ఉన్నతాధికారులు జారీచేసే ఉత్తర్వుల ప్రకారం పనిచేసినా నేటికి వాటి బిల్లులు ప్రభుత్వం చెల్లించలేదని ఆయన అన్నారు. గ్రామపంచాయతీలో జరిగే రోజువారి పనుల నిర్వహణలో భాగంగా ట్రాక్టర్ డీజిల్, శానిటేషన్, బోర్ల రిపేర్లు, పైపు లైను లీకేజీలు, వీధిదీపాల నిర్వహణ, వేసవికాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి సంబంధించిన పనులకు చేసే చెల్లింపులు ప్రతి కార్యదర్శి తనకు వచ్చే నెల వారి జీతం నుండి ఖర్చుచేయడం జరుగుతుంది తద్వారా తమ కుటుంబ అవసరాలకు కూడా అప్పులు చేయాల్సి పరిస్థితి ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, కార్యదర్శుల సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామాభివృద్ధి అవసరాలకు ఉపయోగపడే నిధులు మంజూరు చేయించి, కార్యదర్శులకు వెసులు బాటు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపిడిఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎంపిడిఓకు వినతి పత్రాన్ని సమర్పించిన పంచాయతి కార్యదర్శులు



ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు యజమానికి ఉత్తర్వులు జారీ చేసిన ఎఓ

## భాగ్యలక్ష్మి ట్రేడర్‌లో ఎరువుల అమ్మకాలు నిలిపివేత

**-ఎవో స్వప్నజాదేవ్**

**కౌడిపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోగల భాగ్యలక్ష్మి ట్రేడర్‌లో ఇప్పటినుండి ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు ఎవో స్వప్నజాదేవ్ (స్టాప్ సేల్ ఆర్డర్) ఉత్తర్వులను శనివారం యజమానికి జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని రోజులుగా భాగ్యలక్ష్మి డీలర్ ప్రభుత్వం ప్రకటించిన ధరల కంటే అధనంగా విక్రయిస్తున్నట్లు తమదృష్టికి రావడంతో మొదటిసారి హెచ్చరికగా షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పటికి, సదర్ యజమాని యాథావిధిగా ఎరువులపై అదనంగా డబ్బులు తీసుకుంటున్నట్లు తనకు పిర్యాదులు రావడంతో అమ్మకాలను రద్దు చేసినట్లు తెలిపారు. ఈక నుండి జిల్లా వ్యవసాయ అధికారుల అనుమతులు లేకుండా ఎరువుల అమ్మకాలు చేపట్టినట్లైతే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.

## బాల వీరహన్మాన్ మందిరంలో అన్నప్రసాదా వితరణ

**కౌడిపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో ఎంతో మహిమ కల్గిన శ్రీ బాల వీరహన్మాన్ మందిరంలో శనివారం పూరోహితులు దేశాయిపేట మెట్టు రాములుశర్మ ఆంజనేయస్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, హన్మాన్ చాలీసా పరాయణం చేశారు. దాతల సహాయంతో ఆలయంలో అన్నప్రసాదా వితరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని తిలకించడానికి గ్రామంలో నుండియే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వేసవి వేడిమిని సైతం లెక్కచేయకుండా ఆలయంకు విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నేడు గురుకుల పాఠశాల, కళాశాలలో**

## కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ : ప్రిన్సిపల్ సత్యకుమారి

**కొల్చారం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ నెల 23వ తేదీన (ఆదివారం) కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపల్ సత్య కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు 680 మందికి పరీక్ష నిర్వహిస్తున్న తెలిపారు. పరీక్ష ప్యాడ్, హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటల వరకు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు.

## ఘనంగా స్వయం పాలన దినోత్సవం

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలోని మంజీరా విద్యాలయంలో శనివారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల 9వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. పి.విశాలి హెడ్‌మాస్టర్‌గా, ఎం.మహతి డీఈవోగా, ఎస్. సాయి స్వరూప్ ఎంఈవోగా వ్యవహరించారు. విద్యార్థిని, విద్యార్థులు వారి యొక్క అనుభవాలను స్వయంగా చెప్పడం జరగింది. ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తారు, విద్యార్థుల సహకారం లేకపోతే ఏవిధంగా ఉంటుంది అనేది వాళ్లు ఈరోజు నేర్చుకున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, వాసవిలు మాట్లాడుతూ అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి విజ్ఞానంతో నింపేవాడు ఉపాధ్యాయుడు అన్నారు. ఒక డాక్టర్, ఒక లాయర్, ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్ అయిన మరొకరిని తనలా తయారు చేయలేరని, కాని ఒక టీచర్ మాత్రం తాను అనుకున్నట్లు ఒక విద్యార్థిని తయారుచేయగలరని అన్నారు. చదువుకునే దశలో విద్యార్థిలో ఉన్న నైపుణ్యాన్ని బట్టి ఆ విధమైనటువంటి అడుగుజాడల్లో నడిచేటట్టు తయారు చేసే సతానత ఉన్నటువంటి వారు ఒక్క ఉపాధ్యాయుడే అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జయప్రకాష్, భవాని, సుధాకర్, శ్రీనివాస్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులు



ఆత్మ లింగేశ్వరస్వామి ప్రాణప్రతిష్టలో పూజలుచేస్తున్న మాజీ ఎంపీ బీబీపాటిల్

## హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-జహీరాబాద్ మాజీ ఎంపి బీబీ పాటిల్**

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని జహీరాబాద్ మాజీ ఎంపి బీబీ పాటిల్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటకు వచ్చిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దేశం మొత్తం భారతీయ జనతా పార్టీ వైపు చూస్తుందని, ఇటీవల ఢిల్లీలో, మహారాష్ట్రలో భారీ మెజార్టీతో గెలుపొందడం జరిగిందన్నారు. బీజేపీతోనే సుస్థిర పాలన, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామకృష్ణ, మాజీ సర్పంచ్ సుధాకర్, నాయకులు శ్రావణ్‌కుమార్, బొగుడాల కృష్ణ, రాజమళ్ళ సాయిలు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మలింగేశ్వర స్వామి ప్రాణ ప్రతిష్ట ఉత్సవాల్లో పాల్గొన్న బీబీ పాటిల్**

మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆత్మ లింగేశ్వరస్వామి శివాలయ ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో శనివారం మాజీ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా దేవత పూజలు, మూల మంత్ర హవనం, రుద్ర హోమం, ధాన్య అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈయన వెంట గొట్టిముక్కల ఆలయ కమిటీ బాధ్యులు నరేందర్, దత్తు, సూర్య ప్రకాష్, హనుమంతు, సంగయ్య, గంగారం తదితరులు ఉన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి పుస్తెలు, మెట్టెలు బహూకరణ

**గుమ్మడిదల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల పరిధిలో దోమడుగు గ్రామానికి చెందిన జంగ అనిత, కృష్ణయాదవ్ దంపతుల కుమార్తె లావణ్య వివాహానికి నర్సంపల్లి రాజిరెడ్డి, నాగిరెడ్డి బ్రదర్స్ పుస్తెలు, మెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి తమ వంతు సహాయంగా పేదలకు చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో కావలసినవి సహాయం సమకూరుస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. పేదింటి ఆడబిడ్డలకు తమ వంతుగా పెళ్లిళ్లకు పుస్తె మెట్టలు, ఆర్థిక సహాయం అందించడం, సామాజిక కార్యక్రమాలు చేయడం వల్ల తమకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగ కృష్ణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 18వ రోజుకు చేరిన డంపింగ్ యార్డ్ వ్యతిరేక ధర్నా

**గుమ్మడిదల, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో జేఏసీ ఆధ్వర్యంలో ప్యారానగర్‌లో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం 18వ రోజుకు చేరింది. కొత్తపల్లి, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామస్థులు, మహిళలు, పిల్లలు స్వచ్ఛందంగా ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకొని డంపింగ్ ఏర్పాటును తక్షణమే నిలిపివేయాలని కోరారు. ఈ ధర్నాలో బీజేపీ తాజా మాజీ అధ్యక్షులు పలువు గోవర్ధన్ రెడ్డి, రాజిరెడ్డిలు పాల్గొని వారికి బీజేపీ తరపున సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అంజి రెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సాయిరాం రెడ్డి, కానుకుంట బూత్ అధ్యక్షులు, ముస్లిం నాయకులు ఫయాజ్, షరీఫ్, ఒమర్ పాషా, మహమూద్ హుస్సేన్, ఇంతియాజ్ ఖాన్, షాదుల్లా, హఫీజ్, షాబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

# పట్టభద్రుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:**

పట్టభద్రుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగుల నైపుణ్యాన్ని పెంచేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించారని గుర్తు చేశారు. విద్యారంగ అభివృద్ధికి పట్టభద్రుల సమస్యలు తీర్చే బాధ్యత కాంగెస్ తన భుజస్కందాలపై వేసుకుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు చెప్పే మాయమాటలను పజలు నమ్మరన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సే అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగ పట్టభద్రులు సంక్షేమానికి పాటుపడతానన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో డిజిటలైడ్ చేయడానికి, పాఠకులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తన సొంత నిధుల నుంచి 3 లక్షల ప్రమాద భీమా చేయిస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ముఖ్యమంత్రిని ఒప్పించి ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టభద్రులు తనకు మొదటి ప్రాదాన్యత ఓటు వేయాలని వినతి చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌శెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ కౌన్సిలర్లు వివేకానంద్, హన్మంతు, తాహెర్, మాజీ ఎంపిటిసి సభ్యులు పండరిరెడ్డి, వినోద్ పాటిల్, నాయకులు సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్

**మనూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. మండలంలో ఓటు హక్కును పొందిన పట్టభద్రులు 419 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఓటు హక్కును 16 మంది పొంది ఉన్నారన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును సద్వినియోగం చేసువాలని పట్టభత్రులను, ఉపాధ్యాయులకు తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్‌ఓ శంకర్‌రెడ్డి, ఖాజా మైనుద్దీన్ సూచించారు.

## నేడు గురుకుల ప్రవేశానికి పరీక్షలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఈ నెల 23న సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశించేందుకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లింగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ చారిలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం 251905లో పరీక్షలు రాయబోరే విద్యార్థులు నారాయణఖేడ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు ఉదయం 9 గంటల వరకు హాల్ టికెట్, గుర్తింపు కార్డు (ఆధార్‌కార్డు), బాల్‌పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్‌లతో సమయానికి హాజరు కావాలని సూచించారు.

## ఘనంగా షైన్ స్కూల్ వార్షికోత్సవం

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రామచంద్రాపురంలోని లక్ష్మిగార్డెన్స్‌లో షైన్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి బిఆర్‌ఎస్ నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆదర్శ్‌రెడ్డి తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాద్, నాయకులు పరమేష్ యాదవ్, మైనార్టీ నాయకులు అజీముద్దీన్, గౌస్, గఫూర్, ఖదీర్, కుతుబుద్దీన్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ నేత్రాలయంలో 32 మందికి చికిత్సలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** హైదరాబాద్ గచ్చిబౌలి నానక్‌రామ్‌గూడలోని శంకర్ నేత్రాలయంలో 32 మందికి శనివారం కంటి చికిత్సలు చేశారు. ఈ నెల 20వ తేదీన 48మందికి కంటి పరీక్షలు చేసి ఆసుపత్రికి తరలించగా శనివారం 32 మందికి శస్త్రచికిత్సలు చేసి స్వస్థలాలకు పంపారు. మిగలిన వారికి ఆదివారం శస్త్ర చికిత్సలు అందిస్తామని శ్రీ సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు స్ శంకరప్ప పేర్కొన్నారు.

## బైపాస్ రోడ్డుకు మరమ్మతులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో మున్సిపల్ పరిధిలోని బైపాస్ రోడ్డులో మరమ్మత్తు పనులు చివరి దశలో ఉన్నాయని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం బైపాస్ రోడ్డులోకొనసాగుతున్న మరమ్మతు పనులను దారం శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దారం శంకర్ మాట్లాడుతూ బైపాస్‌రోడ్డు పనులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యల తగ్గుతుందన్నారు. ఉదయం సమయాల్లో ప్రజలు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, గృహిణులు, యువకులకు వాకింగ్ చేసేందుకు అనువాగా ఉందన్నారు. పట్టణంలోని ఏ కాలనీలో సమస్యలు ఉన్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి కోల్ ఇండియా చేయూత

**-కోల్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ సచిన్**

**జహీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పేద, మధ్యతరగతి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కోల్ ఇండియా కంపెనీ చేయూత అందిస్తుందని కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సచిన్ అన్నారు. శనివారం వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జి సర్వీసెస్ వికాస్ ఆధ్వర్యంలో స్టాపూర్ ఎస్‌వి ఫంక్షన్‌హాల్‌లో కోల్ ఇండియా కంపెనీ ఆర్థిక సహాయంతో మహిళలకు రెండవ విడత కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా మహిళల అభ్యున్నతికి కంపెనీ అందిస్తున్న సహకారంపై వివరించారు. మహిళలకు సొంత నిధులతో కట్టు మిషన్లు అందిస్తూ వారు వారి కాళ్లపై నిలిచేలా జీవనోపాధి అందుకుంటున్నారని గుర్తు చేశారు. బిఎంఎస్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షులు వికాస సంస్థ అధ్యక్షులు కొత్తకాపు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వికాస సంస్థ ఆధ్వర్యంలో కోల్ ఇండియా కంపెనీ ఆర్థిక సహాయంతో 380 మంది మహిళలకు గత నెల రోజులుగా కుట్టు మిషన్‌లపై శిక్షణ ఇచ్చి నేడు కుట్టు మిషన్‌లతో పాటు సర్టిఫికెట్లు అందచేసిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి శుక్లవర్ధన్‌రెడ్డి, వికాస సంస్థ ప్రతినిధి కొత్తకాపు సురేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, అభిలాష్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల పరిధి మిర్జాపల్లికి చెందిన సురేష్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న లిలా గ్రూప్ చైర్మన్ డా,,మోహన్ నాయక్ శనివారం నాడు బాధిత కుటుంబానికి రూ.5వేల రుపాయల ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోయిని అరుణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు అందచేయాలని ఎంపిడిఓకు వినతి



ఎంపిడిఓకు వినతి పత్రం అందచేస్తున్న పంచాయితీ కార్యదర్శులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** గ్రామాల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టినా బిల్లులు రాక అవస్థలుపడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ చంద్రశేఖర్‌కు శనివారం పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలంగా గ్రామాల్లో ప్రత్యేక పాలన సాగుతోందని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక గ్రామాల అభివృద్ధికి అప్పులు చేసి పనులు నిర్వహిస్తున్నామన్నారు. సకాలంలో బిల్లులు రాక పడరాని పాట్లు పడుతున్నామని కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిత్యం నిర్వహించే కార్యక్రమాలైన చెత్త సేకరణకు ట్రాక్టరకు డీజిల్, శానిటేషన్, బోర్ల మరమ్మతులు తదితర పనుల నిర్వాహణకు తమకు వచ్చే నెలవారి జీతం నుంచే చెల్లించాల్సి వస్తోందని, తమ ఇండ్లలో కుటుంబ సభ్యులు అర్ధాకలితో అలమించాల్సి దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 13 నెలలుగా నిధులు రావడం లేదని, అధికారులు, పాలకులు స్పందించి బిల్లులు అందించి ఆదుకోవాలని పంచాయితీ కార్యదర్శులు వినతి చేస్తున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : శ్రేయరెడ్డి

**సిర్గాపూర్, పిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని వసతి గృహాన్ని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కుమార్తె, బిఆర్‌ఎస్ నాయకురాలు మహారెడ్డి శ్రేయరెడ్డి శనివారం సందర్శించారు. సిర్గాపూర్‌లో ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ వసతిగృహాన్ని సందర్శించిన సందర్భంగా కూరగాయలు కుళ్లిపోయి ఉన్నాయని, బియ్యం బస్తాల్లో ఎలుకలు చేసిన మలవిసర్జన ఉండటం కానవచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాధ్యులకు సూచించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వసతి గృహాన్ని సందర్శించిన బిఆర్‌ఎస్ నేత శ్రేయరెడ్డి